ఇక భారత్ సైజు చెప్పులు

- భారతీయుల పాదాలకు తగ్గట్టుగా 8 సైజులు
- కొత్త విధానాన్ని రూపొందించిన సెంట్రల్ లెదర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: మనం కొత్తగా షూ లేదా చెప్పులు కొన్నప్పుడు గమనిస్తే.. వాటిపై యూకే/యూరోపియన్ లేదా యూఎస్ సైజులు రాసి ఉంటాయి. చెప్పులపై ఇండియన్ సైజు ఎందుకు ఉండదనే అనుమానం చాలామంది వస్తూ ఉంటుంది. మనం యూకే సైజును పరిగణనలోకి తీసుకోవాలా? యూఎస్ సైజులో కొనాలా? అనేది కూడా గందరగోళమే. ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం రాబోతున్నది. భారతీయుల పాదాలకు తగ్గట్టుగా త్వరలోనే చెప్పుల కొలతలకు కొత్త విధానం అందుబాటులోకి రానున్నది. భారత్ పదంలోని మొదటి అక్షరం 'భా' అని ఈ కొత్త కొలతల విధానాన్ని పిలుస్తున్నారు. దేశవ్యాప్తంగా 79 ప్రాంతాల్లో 1,01,880 మందిపై చెన్నైకు చెందిన సెంట్రల్ లెదర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఐఆర్ – సీఎల్ఆర్ఐ) ఒక సర్వే జరిపి ఈ కొత్త విధానానికి రూపకల్పన చేసింది. దీనిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్(డీపీఐఐటీ)కి ప్రతిపాదించింది. ఈ సర్వే కోసం 3డీ స్కానింగ్ యంత్రాలను వినియోగించి సగటు భారతీయుల పాదాల కొలతలు, పరిణామం, నిర్మాణాన్ని తెలుసుకున్నారు. భారతీయుల పాదాలు యూరోపియన్లు, అమెరికన్ల పాదాల కంటే వెడల్పుగా ఉన్నాయని గుర్తించారు. యూకే, యూఎస్ సైజుల్లో సరైన పాదరక్షలు లభించడం లేదని, ఎక్కువ మంది ఇరుకైనవి, పొడవైనవి ధరిస్తున్నారని తేల్చారు.

85% మందికి సరిపోయేలా 8 సైజులు

మన దేశంలో స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిషర్లు యూకే సైజుల విధానాన్ని తీసుకురాగా, ఇప్పటికీ అదే కొనసాగుతున్నది. ఇప్పుడు కొత్త విధానంలో అన్ని వయసుల వారికి సరిపోయేలా కేవలం ఎనిమిది సైజులు ఉంటే సరిపోతుందని సీఎల్ఆర్ఐ ప్రతిపాదించింది. పిల్లలకు, మహిళలకు, పురుషులకు వేర్వేరు సైజులు ఉండవు. ఏడాది లోపు పిల్లలకు ఒకటో సైజు, ఏడాది నుంచి మూడేండ్ల లోపు పిల్లలకు రెండో సైజు, నాలుగు నుంచి ఆరేండ్ల వయసు వారికి మూడో నంబరు సైజు, ఏడు నుంచి 11 ఏండ్ల వారికి నాలుగో నంబరు సైజు వస్తుంది. 12 – 13 ఏండ్ల అమ్మాయిలకు ఐదో నంబరు సైజు, 12 – 14 ఏండ్ల అబ్బాయిలకు ఆరో నంబరు సైజు సరిపోతుంది. 14 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు మహిళలకు ఏడో నంబరు సైజు, 15 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు పురుషులకు ఎనిమిదో నంబరు సైజు వస్తుంది. 85 శాతం భారతీయులకు ఈ సైజులే సరిపోతాయని సీఎల్ఆర్ఐ చెప్తున్నది.

అభయ్‌రాబ్‌తో కుక్కకాటుకు చికిత్స

ఐఐఎల్ టీకాకు అంతర్జాతీయ గుర్తింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ) : ప్రాణాంతకంగా మారే రేబీస్ వ్యాధిని నియంత్రించేందుకు రూపొందించిన అభయ్‌రాబ్ వ్యాక్సిన్ ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకొంటున్నది. ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) 25ఏండ్ల క్రితం అభయ్‌రాబ్ వ్యాక్సిన్‌ను హైదరాబాద్ కేంద్రంగా తయారు చేసింది. ఈ వ్యాక్సిన్ రూపాంతరం చెందుతున్న రోగకారకాలకు అనుగుణంగా మార్పులు చోటుచేసుకొంటూనే ఉంది. కుక్క కాటు కారణంగా మరణాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ఐఐఎల్ తొలిసారిగా అభయ్‌రాబ్ వ్యాక్సిన్ రూపొందించింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద యాంటీ రేబీస్ వ్యాక్సిన్ ఉత్పత్తి చేసే సంస్థగా ఐఐఎల్ గుర్తింపు పొందింది. ప్రస్తుతం వ్యాక్సిన్లను ప్రపంచ మార్కెట్లకు హైదరాబాద్ కేంద్రంగా ఎగుమతి చేస్తున్నారు. 1998లో వెరోసెల్ ఆధారిత రేబీస్ వ్యాక్సిన్లను ఉత్పత్తి చేయగా, ఇప్పటివరకు 50 దేశాలకే ఎగుమతి చేశారు. కానీ, ఐఐఎల్ 25ఏండ్లలో ఏకంగా 173 మిలియన్ డోసులను మార్కెట్లోకి సరఫరా చేసింది. ప్రస్తుతం జాతీయ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుతో కలిసి శరవేగంగా విస్తరించే జంతు సంబంధిత వ్యాధులకు టీకాలను ఉత్పత్తి చేయడంపై దృష్టి సారించినట్టుగా ఐఐఎల్ వర్గాలు తెలిపాయి. తాజాగా, ఐఐఎల్ 45వ వార్షికోత్సవం సందర్భంగా యాంటీ రేబీస్ వైరస్ నూతన మాడల్‌ను ఆవిష్కరించారు.

మోదీ హయాంలో.. కుటుంబాలు అప్పులపాలు

జీడీపీలో అప్పుల స్థాయి 40 శాతానికి భారీగా తగ్గిన ప్రజల పొదుపు సామర్థ్యం

జీడీపీలో 5 శాతంతో 47 ఏండ్ల కనిష్ఠానికి మోతీలాల్ ఓస్వాల్ తాజా నివేదికలో వెల్లడి

పదేండ్ల బీజేపీ సర్కారు పాలనలో ఆకాశమే హద్దుగా పెరిగిన ధరల ధాటికి దేశంలో పేద, మధ్యతరగతి కుటుంబాల పొదుపు ఆశలు గల్లంతయ్యాయి. చివరకు అప్పులే వారికి దిక్కయ్యాయి. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో అప్పుల స్థాయి 40 శాతానికి పెరగ్గా.. పొదుపు సామర్థ్యం 5 శాతానికి పడిపోయినట్టు ఆర్థిక సేవల సంస్థ మోతీలాల్ ఓస్వాల్ తాజా సర్వేలో వెల్లడించింది.

అప్పులు-పొదుపు లెక్కలివి!

దేశ జీడీపీ	రూ. 290 లక్షల కోట్లు (అంచనా)
అప్పుల స్థాయి	రూ. 116 లక్షల కోట్లు (40 శాతం)
పొదుపు సామర్థ్యం	రూ. 14.5 లక్షల కోట్లు (5 శాతం)

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): మోదీ పాలనలో పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ప్రజల పొదుపు సామర్థ్యం కనీవినీ ఎరుగని రీతిలో పడిపోయింది. ఫలితంగా భారత ఆర్థిక వ్యవస్థ సంక్షోభం అంచుకు చేరే ప్రమాదం దాపురించింది. ఈ మేరకు ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మోతీలాల్ ఓస్వాల్ తాజా సర్వేలో పేర్కొన్న కీలక అంశాలను విశ్లేషిస్తే అర్థమవుతున్నది.

అప్పులు పైపైకి.. పొదుపు పాతాళానికి

ఒకవైపు ప్రజల ఆదాయంతో పాటు పొదుపు సామర్థ్యం తగ్గడం, ఇదే సమయంలో రుణాల భారం పెరగడంతో దేశంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయిందని మోతీలాల్ ఓస్వాల్ నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ముగింపు నాటికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో కుటుంబాల అప్పు స్థాయి 39.1 శాతానికి చేరినట్టు వెల్లడించింది. 2021-22 నాలుగో త్రైమాసికంలో ఈ అప్పుల స్థాయి 38.6 శాతంగానే ఉన్నదని, ఏటికేడూ 16.5 శాతం వృద్ధితో ప్రస్తుతం దాదాపు 40 శాతానికి చేరువైనట్టు వివరించింది. ఇక, నిత్యావసరాలు, స్కూల్ ఫీజులు, సేవలు ఇలా అన్ని రంగాల్లోనూ వస్తు ఉత్పత్తుల ధరలు పెరుగుతుండటంతో ప్రజల పొదుపు సామర్థ్యం క్రమేణా తగ్గిపోతున్నదని నివేదిక వెల్లడించింది. ప్రధానంగా టెలికం, ఆటో, ఇంధనం, ఎఫ్ఎంసీజీ రంగాల్లో ధరాఘాతం.. వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నట్టు అంచనా వేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సెప్టెంబర్ 2023లోని అంచనా ప్రకారం.. 2022-23లో ప్రజల నికర ఆర్థిక పొదుపు 47 ఏండ్ల కనిష్ఠాన్ని తాకుతూ దేశ జీడీపీలో 5.1 శాతానికే పరిమితమైనట్టు నివేదిక ఉటంకించింది. వెరసి బీజేపీ సర్కారు పాలనలో దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలు డబ్బును పొదుపు చేయడాన్ని ఎప్పుడో మరిచిపోయి.. కొత్తగా అప్పులు చేయాల్సిన దుస్థితి వాటిల్లిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రామకృష్ణ మఠం అధ్యక్షునిగా
స్వామి గౌతమానందజీ మహారాజ్

కోల్‌కతా: రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ 17వ అధ్యక్షునిగా స్వామి గౌతమానందజీ మహారాజ్ (95) ఎన్నికయ్యారు. గత నెలలో స్వామి స్మరణానందజీ మహారాజ్ పరమపదించిన నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది. మఠం బోర్డు ట్రస్టీలు, మిషన్ పాలక మండలి బేలూరు మఠంలో బుధవారం సమావేశమై స్వామి గౌతమానందజీని నూతన అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఆయనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. మన సమాజం మరింత విజ్ఞానంతో, కారుణ్యంతో నడిచే విధంగా ఆయన మార్గదర్శకత్వం వహించాలని ఆకాంక్షించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కూడా స్వామిని అభినందించారు.

జేఈఈ మెయిన్‌లో
మన విద్యార్థుల సత్తా

- దేశవ్యాప్తంగా 56 మందికి 100 పర్సంటైల్
- 15 మంది తెలంగాణ విద్యార్థులే
- జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మంది ఎంపిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: జేఈఈ మెయిన్ 2024 ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) జేఈఈ మెయిన్ 2024 ఫలితాలను వెల్లడించింది. ఇందులో 56 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోర్ చేయగా వీరిలో అత్యధికంగా 15 మంది తెలంగాణకు చెందిన విద్యార్థులు ఉన్నారు. ఏప్రిల్ 4 నుంచి 12 వరకు జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 12.57 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దాదాపు 10 లక్షల మందికి పైగా పరీక్షకు హాజరయ్యారు. ఏప్రిల్ 22న తుది 'కీ'ని ఎన్టీఏ విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాగా, అంతకు ముందు జనవరిలో సెషన్-1 పరీక్ష జరిగింది. ఈ రెండు సెషన్లకు హాజరైన విద్యార్థులు సాధించిన స్కోర్లను పరిగణనలోకి తీసుకొని ఎన్టీఏ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేసింది. విద్యార్థులు తమ స్కోర్ కార్డులను ఎన్టీఏ అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో ప్రవేశాలకు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరగనుంది. ఏప్రిల్ 27 నుంచి మే 7 వరకు జేఈఈ అడ్వాన్స్‌డ్ కోసం దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. మే 17 నుంచి 26 వరకు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలి. మే 26న ఉదయం పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం పేపర్-2 పరీక్ష ఉంటుంది. ఫలితాలు జూన్ 9న ప్రకటిస్తారు.

పాకిస్థాన్ యువతికి భారత్ గుండె

అమర్చిన చెన్నై వైద్యులు

చెన్నై, ఏప్రిల్ 24: హార్ట్ ఫెయిల్యూర్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న పాకిస్థాన్‌కు చెందిన ఒక యువతికి భారత్‌కు చెందిన ఒక డోనర్ అందించిన గుండె కొత్త జీవితాన్ని ప్రసాదించింది. పాకిస్థాన్‌లోని కరాచీకి చెందిన 19 ఏండ్ల ఆయేషా రాషన్‌కు చెన్నైలోని ఎంజీఎం హెల్త్‌కేర్ వైద్యులు గుండెను మార్చి పునర్జన్మనిచ్చారు. ఆపరేషన్‌కు రూ.35 లక్షలు అయ్యిందని, అయితే ఆ మొత్తాన్ని ఎంజీఎం హాస్పిటల్, మెడికల్ ట్రస్ట్ వారే భరించారని, వైద్యమంతా ఉచితంగా అందించారని ఆయేషా తల్లి వారికి కృతజ్ఞతలు తెలిపింది. ప్రస్తుతం ఆయేషా ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆమె పాకిస్థాన్ వెళ్లిపోవచ్చునని డాక్టర్లు తెలిపారు.

రష్యా అధ్యక్షుడు
పుతిన్‌పై బయోపిక్

ఏఐతో పుతిన్ పాత్ర సృష్టి

మాస్కో, ఏప్రిల్ 24: అనేక వివాదాలకు కేరాఫ్ లాంటి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ జీవితంపై ఒక బయోపిక్ తెరకెక్కింది. పోలాండ్‌కు చెందిన డైరెక్టర్ బెసలీల్ ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాకు 'పుతిన్' అని పేరు పెట్టారు. ఇప్పటికే 2.5 నిమిషాల ట్రైలర్‌ను విడుదల చేశారు. పుతిన్‌కు సంబంధించిన ఆరు దశాబ్దాల జీవితంలోని అనేక అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారట. చిత్రాన్ని 'సైకలాజికల్ థ్రిల్లర్'గా పేర్కొనడం గమనార్హం. పుతిన్ పాత్రను కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా సృష్టించారు. రష్యా, ఉక్రెయిన్, సిరియా, జోర్డాన్, పోలాండ్‌లో చిత్రీకరించారు.సెప్టెంబర్ 26న సినిమాను రిలీజ్ చేయనున్నారు.

టెన్త్‌లో 93.5% మార్కులు
సంతోషం పట్టలేక స్పృహ తప్పిన విద్యార్థి

మీరట్: పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన సంతోషాన్ని పట్టలేక ఓ విద్యార్థి స్పృహ తప్పి పడిపోయిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగింది. పోస్టాఫీసులో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్న సునిల్ కుమార్ కుమారుడు అన్షుల్ కుమార్ (16) అనే విద్యార్థి మీరట్‌లోని మహర్షి దయానంద విద్యాసంస్థలో పదో తరగతి చదివాడు. శనివారం వెలువడిన ఫలితాల్లో 93.5 శాతం మార్కులు సాధించాడు. దీంతో పట్టరాని సంతోషంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో అతడి కుటుంబసభ్యులు దవాఖానకు తరలించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

మావోయిస్టుల క్యాంపుపై
భద్రతా దళాల దాడి

కొత్తగూడెం క్రైం: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న క్యాంపుపై భద్రతా దళాలు బుధవారం దాడులు నిర్వహించి ధ్వంసం చేశాయి. నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు క్యాంపు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు క్యాంపుపై దాడి చేసి పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రి, ఎల్రక్ట్రిక్ వైర్లతోపాటు ఇతర వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.